


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 30-6-2025

సంపుటి: 21 సంచిక: 83

పేజీలు: 8 వెల: రూ.1



# అప్పల..'రాజ'రికం పనికిరాదు!



- ❖పోటీకి ఆయన పనికి రారంటున్న సొంత పార్టీ నేతలు
- ❖ఎన్నికలకు నాలుగేళ్ల ముందే అధిష్టానానికి ఫిర్యాదులు
- ❖మాజీ మంత్రిపై ఏమాత్రం తగ్గని అసమ్మతి

ఈ సిటీకి వచ్చిన కొత్తలో మీరెలా ఉండేవారు? ఇప్పుడెలా ఉన్నారు.. మీకైనా అర్థమవుతోందా? అంటూ ఇడియట్ సినిమా క్లైమాక్స్ సీనులో పోలీస్ కమిషనర్ పాత్రధారి ప్రకాశ్‌రాజ్‌ను ప్రశ్నిస్తూ అతని పై అధికారి పాత్రధారి సత్యనారాయణ వేసిన డైలాగ్ ఇది. తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న నియోజకవర్గంలో ఫ్రెష్‌గా ఒక విద్యావంతుడు రాజకీయాల్లో తీసుకొస్తే గెలుపు సులభమవుతుందని భావించిన వైకాపా డాక్టర్ సీదిరి అప్పలరాజును తీసుకొచ్చి 2019 ఎన్నికల్లో పలాస బరిలో నిలబెట్టింది. రాజకీయాల్లోకి కొత్త వచ్చి తొలిసారి ఎమ్మెల్యే అయిన ఆయనకు కొన్నాళ్లకే మంత్రి పదవి కూడా ఇచ్చింది. రెండున్నరేళ్ల తర్వాత చేపట్టిన సర్దుబాటులో కూడా ఆయన్ను కొనసాగించింది. అటువంటి అప్పలరాజు 2024 ఎన్నికలకు వచ్చేసరికి ఎందుకిలా మారిపోయారు? రాజకీయాల్లో సుదీర్ఘ కాలం గెలిచిన గుర్రాలే తక్కువైపోతున్న ఈ రోజుల్లో తనతో నడిచి వచ్చినవారిని మధ్యలోనే వదిలేసే ప్రయత్నాలు ఎందుకు చేశారు? వచ్చే ఎన్నికల్లో ఆయన టికెట్ ఇవ్వొద్దని సొంత పార్టీవారే.. ఇదీ ఇప్పటినుంచే ఎందుకు డిమాండ్ చేస్తున్నారు?



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సాధారణ ఎన్నికలు జరిగి ఏడాదే అయ్యింది. మళ్లీ ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల వ్యవధి ఉంది. అయినా ఇప్పటినుంచే పలాస వైకాపాలో టికెట్ రాజకీయాలు ఊపందుకున్నాయి. అప్పలరాజుకు మరోసారి టికెటిస్తే గెలిచే అవకాశాలు లేవని వైకాపాకు చెందిన కొందరు సీనియర్లు జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంట్ ఇన్‌ఛార్జి తమ్మినేని సీతారామ్‌లను కలిసి తమ మనోగతాన్ని వెల్లడించిన సందర్భంగా రాస్తున్న కథనం కాదిది. నాయకుడున్న తర్వాత సహజంగానే అసంతృప్తి, అసమ్మతి ఉంటాయి. అయితే అది తన నాయకత్వానికి ముప్పు తేచ్చేంతగా పెరగకుండా జాగ్రత్త పడటం రాజకీయాల్లో పైకి రావాల్సినవారి బాధ్యత. సీదిరి అప్పలరాజుపై సొంత పార్టీలోనే అసంతృప్తి వ్యక్తమవడం ఇదే మొదటిసారి కాదు. 2019-24 మధ్యలో మంత్రిగా ఉన్నప్పుడే ఆయన పోకడలు నచ్చక వంద నుంచి వెయ్యి ఓట్ల వరకు ప్రభావితం చేయగల పలువురు స్థానిక నాయకులు ఆయనపై తిరుగుబాటు జెండా ఎగరేశారు. ఆయనకు వ్యతిరేకంగా వేదకలు మార్చి మార్చి సమావేశాలు కూడా పెట్టారు. 2024 ఎన్నికల్లో అప్పలరాజు గెలుపు కోసం పని చేయలేమని బహిరంగంగానే ప్రకటించారు. ఆయనపై వచ్చిన ఆరోపణలను గుదిగుచ్చి ఏకంగా వెయ్యి పేజీల పుస్తకాన్ని తయారు చేసిమరీ అప్పటి ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి వైవీ సుబ్బారెడ్డికి అందించారు. ఇంత జరిగినా అక్కడ పార్టీ అధినేత జగనూ పట్టించుకోలేదు.. ఇక్కడ అప్పలరాజూ అసమ్మతి నేతలతో మాట్లాడలేదు. దాంతో పార్టీ పెట్టిన నాటినుంచీ ఉన్న అనేక మంది నాయకులు వైకాపాను వీడారు. దాని ఫలితమే 2024 ఎన్నికల్లో సిటింగ్ మంత్రిగా అప్పలరాజు ఘోర పరాజయం.

## ఏకపక్ష పోకడలతోనే అసమ్మతి

ఇక్కడ ఘోర పరాజయం అనే పదం వాడటం కారణం చెప్పాలంటే గత ఎన్నికల్లో ఓటింగ్, మెజార్టీల గురించి ప్రస్తావించాలి. జిల్లాకే చెందిన మరో సిటింగ్ మంత్రి ధర్మాన ప్రసాదరావు 52 వేల ఓట్ల తేడాతో ఓడిపోయినప్పుడు 42,600 ఓట్ల తేడాతో ఓడిన అప్పలరాజుది ఘోర ఓటమి ఎలా అవుతుందనే ప్రశ్న తలెత్తవచ్చు. వాస్తవానికి శ్రీకాకుళం నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 2.75 లక్షలు (2019 ఎన్నికల సమయంలో 2,55,177 మంది ఓటర్లు). అదే పలాస నియోజకవర్గంలో ఓట్లు 2.28 లక్షలు (2019 ఎన్నికల సమయంలో 2,04,109 ఓటర్లు). 80 శాతం పోలింగ్ శాతం చూసుకుంటే 42,600 ఎక్కువ. ఇంత తేడా ఎందుకొచ్చిందనడానికి ప్రధాన కారణం 25వేల పైచిలుకు వైకాపా ఓట్లు టీడీపీకి మరలిపోయాయనేది కాదనలేని సత్యం. ఇంత పెద్దఎత్తున ఓట్లు మళ్లడానికి ప్రధాన కారణం మంత్రిగా అప్పలరాజు ఏకపక్ష పోకడే. 2019లో తొలిసారి ఎన్నికల బరిలో నిల్చున్న అప్పలరాజు 16,500 ఓట్ల మెజార్టీ తెచ్చుకోగలిగారు. వాస్తవానికి పలాస నియోజకవర్గంలో ఏ అభ్యర్థి గెలిచినా మెజార్టీ స్టామినా అంతే. ఎందుకంటే.. 2014 ఎన్నికల్లో గౌతు శ్యామ సుందర శివాజీ గెలిచినప్పుడు 17,500 ఓట్లు మెజార్టీ వచ్చింది. కానీ 2024 ఎన్నికల్లో మంత్రి

- మిగతా చివరి పేజీలో



• ఎడిటోరియల్

# జాతీయ రహదారుల డిజిటలైజేషన్

జాతీయ రహదారుల రూపురేఖలు శరవేగంగా మారుతున్నాయి. డిజిటైలేజేషన్ దిశగా పరుగులు తీస్తున్నాయి. కేంద్ర ఉపరితల రవాణా శాఖ పరిధిలోని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) నిర్వహించే జాతీయ రహదారులను ఒకవైపు జోరుగా విస్తరణకు నోచుకుంటున్నాయి. మరోవైపు దేశంలోనే అనేక రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చడం, నాలుగు, ఆరు లైన్లకు విస్తరిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. అదే సమయంలో ఈ రహదారుల నిర్వహణలో అత్యాధునిక సాంకేతికను జోడిస్తూ వాహన యజమానులకు వీలైనన్ని ఎక్కువ సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తోంది. దేశంలో తొలిసారి వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో బోవోటీ (బిల్డ్, ఓన్, ట్రాన్స్‌ఫర్) విధానంలో గోల్డెన్ క్వాడ్రిలేటర్ ప్రాజెక్టు చేపట్టారు. దేశంలోని ప్రధాన నగరాలైన ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై నగరాలను అనుసంధానించే నాలుగు జాతీయ రహదారులను ఈ పథకం కింద నాలుగు లైన్లకు విస్తరించారు. వీటి నిర్మాణ ఖర్చులు రాబట్టుకునేందుకు ఈ రహదారుల్లో టోల్ ప్లాజాలు ఏర్పాటు చేసి ఫీజు వసూలు చేయడం మొదలుపెట్టారు. నిర్మాణ ఖర్చులు తిరిగి వచ్చేసిన తర్వాత ఆయా ప్రాంతాల్లో టోల్ ప్లాజాలను ఎత్తివేయాలన్నది నిబంధన. అయితే అప్పటి నుంచి జాతీయ రహదారులపై టోల్ వసూళ్లు కొనసాగుతున్నాయి. తొలినాళ్లలో మాన్యువల్‌గా టోల్‌ప్లాజాల వద్ద వాహనాలను ఆపి డబ్బులు కట్టించుకునేవారు. తర్వాత ఆన్‌లైన్ విధానం అమల్లోకి వచ్చింది. అనంతరం ఫాస్ట్‌ట్యాగ్ విధానం తీసుకొచ్చి ఆటోమేటిక్‌గా టోల్ కట్టే సౌకర్యం కల్పించారు. ఇటీవలే ఏడాదికి రూ.మూడు వేలు చెల్లిస్తే 200 ట్రిపుల వరకు ఇక టోల్ కట్టక్కర్లేని వెసులుబాటు అందుబాటులోకి తెచ్చారు. ఇప్పుడు పూర్తిగా హైవే వ్యవస్థను డిజిటలైజ్ చేసేందుకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ చర్యలు చేపట్టింది. జాతీయ రహదారులపై ప్రయాణ సమయంలో ట్రాఫిక్ అతిక్రమణతోపాటు ఇతర రోడ్డు రవాణా నిబంధనలను ఉల్లంఘించే వారిని ఆధునిక సాంకేతికత సాయంతో పట్టుకుని రోడ్డు ప్రమాదాలను నివారించడం దీని ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. ఈ ప్రయత్నంలో తొలి అడుగుగా.. ప్రయోగాత్మకంగా ఢిల్లీ–గురుగ్రామ్ ద్వారకా ఎక్స్‌ప్రెస్ వేపై అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏటీఎంఎస్)ను అమల్లోకి తీసుకొచ్చారు. దాంతో దేశంలోనే తొలి స్మార్ట్ డిజిటల్ హైవేగా ఈ రహదారి గుర్తింపు పొందింది. ఎన్‌హెచ్‌ఏఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ ఈ వ్యవస్థను అభివృద్ధి చేసింది. 56.46 కిలోమీటర్ల నిడివి ఉన్న ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, ఎన్‌హెచ్–48 రూట్లపై ఈ టెక్నాలజీని విజయవంతంగా అమలు చేశారు. ఇందులో భాగంగా 28 కిలోమీటర్ల ప్రాంతాన్ని అధునాతన నిఘా వ్యవస్థతో సమీకరించారు. ముఖ్యంగా ట్రాఫిక్ మానిటరింగ్, ప్రమాదాల నివారణ, వేగ పరిమితి నియంత్రణ వంటి అంశాల్లో ఇది కీలకంగా మారనుంది. ఈ స్మార్ట్ ట్రాఫిక్ వ్యవస్థలో భాగంగా, సీటు బెల్ట్ లేకుండా డ్రైవ్ చేయడం, ట్రిపుల్ రైడింగ్, పరిమితి మించిన వేగం వంటి 14 రకాల నిబంధనల ఉల్లంఘనలను ఈ ఆధునిక వ్యవస్థ ఎటువంటి మానవ సహాయం లేకుండానే గుర్తిస్తుంది. ఈ సమాచారాన్ని తక్షణమే నేరుగా పోలీసులకు పంపేలా, ఎన్ఐసీ ఈ–చలాన్ పోర్టల్‌తో అనుసంధానం చేశారు. వాహనాలపై నిఘా కోసం జాతీయ రహదారి వెంబడి ప్రతి కిలోమీటర్‌కు ఒకటి చొప్పున, మొత్తం 110 హై రిజల్యూషన్ పీటీజెడ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇవి 24 గంటలూ పని చేస్తూ రహదారిపై పరుగులు తీసే వాహనాలను తమ నిఘా కళ్లతో పరిశీలిస్తుంటాయి. ట్రాఫిక్‌ను పర్యవేక్షించడం, ప్రమాద ఘటనలను వీడియోల్లో బంధించడం, వాహనాల వేగాన్ని గుర్తించి నమోదు చేయడం, సెంట్రల్ కంట్రోల్ రూమ్‌కు నిరంతరం సమాచారాన్ని చేరవేయడం వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి. దీనిలోని కమాండ్ సెంటర్‌ను డిజిటల్ బ్రెయిన్ మాదిరిగా తీర్చిదిద్దారు. రహదారిపై ఏదైనా ప్రమాదం సంభవించిన వెంటనే ఆ విషయాన్ని ఈ డిజిటల్ బ్రెయిన్ సమీప ంలోని రహదారి భద్రత సిబ్బందికి అలర్ట్ మెసేజ్ పంపుతుంది. పొగమంచు, రహదారి అవాంతరాలు, జంతువుల ప్రవేశం వంటి విపత్తులను ముందుగానే గుర్తించి అప్రమత్తం చేస్తుంది. మొత్తం మీద భారత రహదారులు మరింత ఆధునికత, భద్రత, డిజిటలైజేషన్ వైపు దూసుకుపోతున్నాయి. ఢిల్లీ–గురుగ్రామ్ హైవేపై అమలు చేసిన ఈ స్మార్ట్ వ్యవస్థ విజయవంతం కావడంతో దేశంలోని అన్ని నేషనల్ హైవేలను ఈ వ్యవస్థ పరిధిలోకి తీసుకురానున్నారు.

# సేవా దృక్పథం అలవరచుకోవాలి

## రక్తదానం చేద్దాం ముగ్గురు జీవితాలు కాపాడుకుందాం
## పీజే బ్లడ్ సెంటర్ ప్రారంభించిన డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు






(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సమాజంలో అందరూ సేవాదృక్పథం అలవారచుకోవాలని ప్రముఖ వైద్య నిపుణులు కొంచాడ సోమేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద రెవిన్యూ అతిథి గృహం సమీపంలో ఉన్న సత్య డైగ్నోస్టిక్ సెంటర్‌లో ప్రముఖ పాతోలజీ విద్య నిపుణులు పీజే నాయుడు ఏర్పాటు చేసిన పీజే హెల్త్ సొసైటీ కి చెందిన పీజే బ్లడ్ సెంటర్ ను సోమేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ పీజే నాయుడు సేవా భావం కలిగిన వ్యక్తిగా జిల్లా ప్రజలకు సూపరచితుడేనన్నారు. జిల్లాలో సీనియర్ పాథాలోజిస్ట్‌గా సేవలు అందిస్తూనే పీజే బ్లడ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం శుభపరిణామమని అభినందించారు. స్వచ్చింద రక్త దానం చేయడానికి ముఖ్యంగా యువత ముందుకు రావాలని కోరారు. ఒకరు చేసే రక్త దానం ముగ్గురు జీవితాలను కాపాడుకోవచ్చున్నారు. పీజే హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో దీన్ని సేవా భావంతో నిర్వహించాలని కోరారు. మన సమాజంలో ఎంతో మంది రక్తం కొరతతో జీవితంతో పోరాడుతున్నారని అలాంటి వారి జీవితం వెలుగులు నింపే మార్గం రక్తదానం అన్నారు. రక్తదానంచేసే అవకాశం ఆరోగ్యకరమైన వ్యక్తులందరికి ఉన్న అమూల్యమైన వరం అన్నారు. పీజే నాయుడు మాట్లాడుతూ పీజే హెల్త్ సొసైటీ ద్వారా బ్లడ్ సెంటర్ ను నిర్వహిస్తున్నామన్నారు. లాభాపేక్షతో కాకుండా సేవా దృక్పథంతో నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒక్క యూనిట్ రక్తంతో ముగ్గురికి జీవితం ఇవ్వవచ్చున్నారు. రక్తదానం వల్ల ఆరోగ్యాన్ని కూడా పెంపొందించుకోవచ్చు అన్నారు. రక్తదానం చేసిన వారిలో రక్తంలో కొత్త కణాలు ఉత్పత్తి అవుతాయన్నారు. ఇది శరీరానికి మంచిదన్నారు. రక్తదానం మానవత్వాన్ని పెంపొందించే, నష్టంలేని చర్య అని అన్నారు. 18–60 ఏళ్ళ మధ్య వయస్సు ఉన్న ఆరోగ్యవంతులు, కనీసం 50 కిలోల బరువు కలిగి, హిమోగ్లోబిన్ 12.5 పాయింట్లు కంటే ఎక్కువ ఉన్నవరంతా రక్తదానం చేయవచ్చు అన్నారు. ప్రతి 3 నెలల్లో ఒకసారి రక్త దానాలు చేయవచ్చున్నారు. టైఫాయిడ్, హెపటైటిస్, మలేరియాతో భాద పడుతున్నవారు రక్త దానం చేయకూడదన్నారు. పురుషులు ప్రతి 90 రోజులకు ఒక సారి, మహిళలు ప్రతి 120 రోజులకు ఒకసారి రక్త దానం చేయవచ్చు అని తెలిపారు. గర్భిణీ, పాలిచ్చే తల్లులు, తీవ్ర అనారోగ్య సమస్యలున్నవారు రక్తదానం చేయకూడదన్నారు. మద్యం సేవించిన కొన్ని గంటల తరువాత రక్త దానం చేయవచ్చు అని తెలిపారు.రక్తం కృత్రిమంగా తయారుచెయ్యలేనిదన్నారు. దీన్ని రక్తదానం ద్వారానే సమాకుర్చుకోవడం ఒక్కటే మార్గమన్నారు. మన చుట్టూ ఉన్న సమాజాన్ని ఆరోగ్యంగా తో ఉంచడానికి అందరూ స్వచ్చిందా రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. అనారోగ్యంతో పోరాడుతున్న వ్యక్తికి కొత్త శ్వాసను అందించేది రక్త దానం అన్నారు .

ఈ సందర్భంగానగరానికి చెందిన పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు, యువత స్వచ్ఛంద రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు దానేటి శ్రీధర్, మూల వెంకటరావు దంపతులు, గుడేన సోమేశ్వరరావు, కె అమ్మన్నాయుడు, డి హరిప్రసాద్, కే ఎల్ నాయుడు, రంగనాథ్, మనోజ్, ఎం ధనుంజయ, జి.సందీప్, హనుమంత అనిల్ కుమార్, కిల్లి చిన్నబాబు, ప్రముఖులు చింతాడ రామ్మోహన్, శిష్టు రమేష్, పెడాడ రామ్మోహన్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. రక్తదానం చేసినవారికి ధ్రువీకరణ అందజేశారు.

## కార్పొరేట్లకు వరాలు.. ప్రజలకు భారాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

టీడీపీ కూటమి ఏడాది పాలన "కార్పొరేట్లకు వరాలు–ప్రజలపై భారాలు"గా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో దారి తప్పుతున్న టీడీపీ కూటమి ఏడాది పాలన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన తలకిందులుగా ఉందన్నారు. ప్రజలకు హామీలు, వాగ్దానాలు, మాటలే మిగిలాయని, కార్పొరేట్లకు కారుచౌకగా భూములు కట్టబెడుతున్నారని, వారి పనులు వేగమవుతున్నాయని వారు విమర్శించారు. సూపర్–6తో సహా హామీలు వైఫల్యం, విద్యుత్తు, పన్నుల భారాలు, గిట్టుబాటు ధర లేకపోవడం కనీస వేతనాలు అమలు కాకపోవడం, ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలు ఏఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదని, జీడికి గిట్టుబాటు ధర ఇచ్చి బోర్డు ఏర్పాటు చేస్తామన్న వాగ్దానం అమలు జరగలేదని, జిల్లాలో ఐటిడిఏ ఏర్పాటు చేస్తామన్న హామీ నేటికీ నెరవేరలేదని, కోడి రామ్మూర్తి స్టేడియం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని, వంశధార నిర్వాసితులకు ఇస్తామన్న స్పెషల్ ప్యాకేజ్ నేటికీ అమలు జరగలేదని వారు విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో అధమస్థానంలో ఉన్న ప్రభుత్వం ప్రజల పైన భారాలు వేయడంలో ప్రథమ స్థానంలో ఉందని వారు విమర్శించారు. స్మార్ట్‌మీటర్లతో సామాన్యులకు లక్షలలో బిల్లులు వస్తున్నాయన్నారు. నగరాల్లో ఇల్లు, షాపులు, ఖాళీ స్థలాలు కు విలువ ఆధారిత ఆస్తి పన్ను భారీగా పెంచారని విమర్శించారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్‌మీటర్లను పగలగొట్టాలని చెప్పడంతో పాటు స్మార్ట్ మీటర్ల కు వ్యతిరేకంగా కోర్టులో కేసు వేశారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి స్మార్ట్ మీటర్లు బిగిస్తోందన్నారు. టిడిపి కూటమి ఇచ్చిన వాగ్దానాలను ఇకనైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలో ఉన్న మున్సిపల్ కార్యాలయము, పెద్ద మార్కెట్, బాపూజీ కళామందిర్, నగరంలో ఉన్న ఐదు పార్కులు, జిల్లా కేంద్ర గ్రంథాలయం తదితర ఆస్తులు ప్రైవేటీకరణ ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోనారి మోహన రావు, పి.తేజేశ్వరరావు ఉన్నారు.




# గెస్ట్‌రోల్స్‌తో లాభమేంటి ప్రభాస్?

రెబల్‌స్టార్ ప్రభాస్ కన్నప్ప సినిమాలో రుద్ర పాత్రలో సర్‌ప్రైజ్ చేశారు. మంచు విష్ణు కన్నప్పకి ఈ రేంజ్ క్రేజ్ పాపులారిటీ వచ్చింది అంటే పైన ఉన్న ఆ శివుడి ఆశీస్సులు అయితే.. సినిమాకు జనాలు రావడానికి మాత్రం రుద్రుడు అదే ప్రభాస్ ఇమేజ్ అని చెప్పొచ్చు. మంచు విష్ణు ఇది ఆలోచించే ప్రభాస్ ని ఈ ప్రాజెక్ట్ లోకి తీసుకొచ్చాడని అనుకుంటున్న వారు ఉన్నారు. ప్రభాస్ తో పాటు అక్షయ్ కుమార్, మోహన్ లాల్ ఇలా స్టార్స్ ఉన్నా టికెట్లు తెగాయంటే మాత్రం అది ప్రభాస్ వల్లే అని చెప్పొచ్చు. మంచు విష్ణు కూడా ఆ విషయాన్ని ఒప్పుకున్నారు. ఐతే కన్నప్ప సినిమాలో ప్రభాస్ రోల్ ఫ్యాన్స్ ని సంతృప్తి పరచినా అసలు ప్రభాస్ ఇలాంటి రోల్స్ ఎందుకు చేస్తున్నాడు అన్న సందేహం రాక మానదు. గెస్ట్ రోల్స్ వల్ల ప్రభాస్ కి లాభం ఏంటి అని డౌట్ రాక తప్పదు. మంచు విష్ణు సినిమాకు ఒకసారి వాయిస్ ఓవర్ ఇచ్చిన ప్రభాస్ కన్నప్ప కోసం ఈసారి తానే గెస్ట్ రోల్ చేశాడు. అంతేకాదు ఈ సినిమాలో నటించినందుకు ప్రభాస్ అసలేమాత్రం పారితోషికం తీసుకోలేదు. బుజ్జిగాడు సినిమాలో మోహన్‌బాబు ప్రతినాయకుడిగా నటించడం.. అప్పటి నుంచి ప్రభాస్‌తో మంచి రిలేషన్ ఏర్పడటం వల్ల మోహన్‌బాబు వల్ల కూడా ప్రభాస్ కన్నప్ప చేశాడని చెప్పొచ్చు. ఐతే ప్రభాస్ కన్నప్పలో భాగం అవ్వడానికి వీటన్ని కన్నా బలమైన రీజన్ రెబల్ స్టార్ కృష్ణం రాజు నటించిన భక్త కన్నప్పని మళ్లీ ఇన్నాళ్లకు మంచు విష్ణు ప్రయత్నించడం వల్ల ఆ సినిమాలో తాను భాగం అవ్వాలనే ఉద్దేశంతో ప్రభాస్ రుద్ర పాత్రలో నటించాడని చెప్పొచ్చు. ఐతే ఇలాంటి పాత్రల వల్ల ప్రభాస్ కి ఎలాంటి ఉపయోగం ఉండదు. ఎంత సినిమాను టర్న్ చేసే రోల్ అయినా ప్రభాస్ సోలో సినిమాలు చూసేందుకే ఫ్యాన్స్ ఇష్టపడతారు కానీ ఇలా గెస్ట్ రోల్స్ వల్ల ఫ్యాన్స్ పూర్తిగా సంతృప్తి చెందే ఛాన్స్ లేదు. మరి ప్రభాస్ ఇక మీదట మళ్లీ ఇలాంటి ప్రయత్నాలు చేస్తాడా చేస్తే ఫ్యాన్స్ నుంచి ఎలాటి రెస్పాన్స్ వస్తుంది అన్నది చూడాలి. ప్రభాస్ తను కమిటైన సినిమాలను పూర్తి చేస్తే చాలని ఇలాంటి చిన్న చిన్న రోల్స్ వల్ల ఎలాంటి యూజ్ ఉండదని రెబల్ ఫ్యాన్స్ కొందరు అభిప్రాయపడుతున్నారు.



- తుపాకి.కామ్ సౌజన్యంతో...




# కన్యారాశికి టైమ్ వచ్చింది

ఈ నగరానికి ఏమైంది' విడుదలై ఏడేళ్లయ్యింది. ఈ సినిమాకు సెపరేట్ ఫ్యాన్ బేస్ వుంది. ఇప్పటికీ రిపీట్ మోడ్ లో చూస్తూనే ఉంటారు. పెళ్లి చూపులు లా ట్రెండ్ సెట్టర్ కాదు కానీ, తరుణ్ భాస్కర్ బెస్ట్ వర్క్ ఈ సినిమాలో కనిపిస్తుంది. ఇటీవల రీ రిలీజ్ చేస్తే యూత్ అంతా థియేటర్లకు క్యూ కట్టారు. ఈ సినిమాకు సీక్వెల్ చేయాలని ఎప్పటి నుంచో అనుకొంటున్నారు. ఇప్పటికి అది సెట్ అయ్యింది. 'ఈఎన్ఈ రిపీట్' పేరుతో ఈ సినిమాకు సీక్వెల్ తీస్తున్నారు. ఓ సీక్వెల్ కు ఇంగ్లీష్ అక్షరాలతో టైటిల్ పెట్టడం వెరైటీగా వుంది. సురేష్ బాబు తో పాటుగా సృజన్, సందీప్ నాగిరెడ్డి నిర్మాతలు గా వ్యవహరిస్తున్నారు. విశ్వక్‌సేన్‌తో పాటు మిగిలిన బ్యాచ్ అభినవ్ గోమట్టం, సాయి సుశాంత్ రెడ్డి, వెంకటేష్ కాకమాను కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈరోజు సీక్వెల్ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. 'ఏళ్ల నాటి శనిపోయింది 'కన్యారాశికి టైమ్ వచ్చింది' అంటూ సీక్వెల్‌ని ఘనంగా మొదలెట్టారు. ఈ సందర్భంగా ఈ చిన్న వీడియో గ్లింప్స్ విడుదల చేశారు. అది కాస్త వెరైటీగా వుంది. వివేక్ సాగర్ సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శర వేగంగా సాగుతున్నాయి. త్వరలోనే షూటింగ్ మొదలెడతారు. ఇందులో ఇద్దరు కథానాయికలకు చోటుంది. వాళ్లెవరన్నది త్వరలో ప్రకటిస్తారు. 'ఈ నగరానికి ఏమైంది' సినిమాలో కథనం, క్యారెక్టరైజేషన్లు, డైలాగులు కొత్త ట్రెండ్‌ని సృష్టించాయి. చాలా సహజంగా సన్నివేశాల్ని తెరకెక్కించారు తరుణ్ భాస్కర్. వాటికి మించిన వినోదం, సహజత్వం ఈ కథలో ఉంటుందని చిత్రబృందం నమ్మకంగా చెబుతోంది. తరుణ్ భాస్కర్ కూడా దాదాపు నాలుగేళ్లుగా ఈ కథపై వర్క్ చేస్తున్నారు. మరి ఫలితం ఎలా ఉంటుందో చూడాలి.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో..

## ఉపాధిలో అవినీతిపై విచారణ చేయాలి

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేయించాలని ఎచెర్ల వైకాపా స్థానిక సంస్థల ప్రతినిధులు గ్రీవెన్స్‌లో అధికారులకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్.ఆర్.ఈ జి.ఎస్. చట్టం మేరకు ఉపాధి హామీ పనులు గ్రామ పంచాయితీల ద్వారానే జరిపించాలన్నారు. కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. సర్పంచులకు తల్లికి వందనం పథకాన్ని తక్షణమే వర్తింపచేయాలన్నారు. కేంద్రం విడుదల చేసిన 15వ ఫైనాన్స్ కమిషన్ విడుదల చేసిన నిధులు రూ.1,150 కోట్లు స్థానిక సంస్థలకు తక్షణమే జమచేయాలన్నారు. ఈ బిల్లుల చెల్లింపుల్లో రాజకీయ జోక్యం నివారించాలన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 73,74 సవరణల మేరకు సర్పంచులకు ఉన్న అధికారాలను అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ హామీ మేరకు గ్రామాల్లో వసూలు చేస్తున్న ఇంటి పన్నులను స్థానిక సంస్థల ఖాతాల్లో జమచేయాలన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు గౌరవ వేతనాలు వెంటనే పెంచాలన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న గౌరవ వేతనాలను సకాలంలో చెల్లించాలన్నారు. ఎచ్చెర్ల మండల సర్పంచులు, ఎంపీటీసీలు, వైకాపా పంచాయతీరాజ్ విభాగం ప్రతినిధులు నేతింటి నీలప్పడు, జరుగుల శంకర్రావు, జగదీష్, బి.సాయిరాం, సనపల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు



## విద్యావ్యవస్థను కూటమి ప్రభుత్వం నాశనం చేసింది

(సత్యంన్యూస్, పాతపట్నం)



నాణ్యమైన విద్యను అందించడంలో కూటమి ప్రభుత్వం యొక్క నిబద్ధత ప్రశ్నార్థకంగా మారుతోందని వైకాపా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కూటమి ప్రభుత్వం విద్యా రంగంలో సంస్కరణల పేరుతో తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు విద్యా ప్రమాణాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని, ఇది దీర్ఘకాలంలో రాష్ట్ర ప్రగతికి ఆటంకం కలిగిస్తుందన్నారు. ఒక బలమైన మరియు సమర్థవంతమైన విద్యావ్యవస్థే ఒక సమాజానికి పునాది అని, దీనిని నిర్లక్ష్యం చేయడం వల్ల భవిష్యత్ తరాలు తీవ్రంగా నష్టం కలుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత కూటమి ప్రభుత్వం వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో అమలు చేయబడిన విద్యా రంగ సంస్కరణలను పూర్తిగా నిర్వీర్యం చేస్తోందన్నారు. 'నాడు-నేడు' ద్వారా రాష్ట్ర విద్యా వ్యవస్థలో కీలక మార్పులు తీసుకువచ్చామన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా మున్సిపల్ పారిశుధ్య , ఇంజినీరింగ్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని 4 లేబర్ కోడ్లు యొక్క నిర్ణయం 10 గంటల పని దినం నిర్ణయం వెంటనే వెనక్కు తీసుకోవాలని, కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులు కనీస వేతనాలు అమలు చేయాలని, అవుట్సోర్సింగ్ కార్మికులకు రిటైర్మెంట్ వయస్సు 62 పెంచాలని, శ్రీకాకుళం నగరపాలక సంస్థ విస్తీర్ణం అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, పర్మినెంట్ కార్మికులకు సకాలంలో ఇంక్రిమెంట్లు, డీఏలు సరెండర్ లీవులు ఇవ్వాలని, అవుట్ సోర్సింగ్ విభాగంలో పని చేసి రిటైర్మెంట్ అయినా స్థానం వారి పిల్లలకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలని, స్థానిక మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్ కుమార్ సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయుకులు జె.గురుమూర్తి , ఎన్.పార్థసారథి, సూర్యకల, సోషల్ మీడియా ప్రతినిధి అరుగుల రమణ తదితరులు పాల్గొన్నారు

## ఆర్టీఈ అడ్మిషన్ల లోటుపాట్లపై దృష్టి సారించండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పేద విద్యార్థుల విద్యాభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని అమలు చేస్తున్న ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం(ఆర్టీఈ)అడ్మిషన్ల లోటు పాట్లుపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉన్నతాధికారులకు లేఖ వ్రాసినట్లు చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి తెలిపారు. సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆమె మాట్లాడుతూ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలు, వివిధ యాజమాన్య పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం 2009,సెక్షన్ 12(1)(సీ)ను అనుసరించి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మొదటిరౌండ్‌లో కేటాయించిన అడ్మిషన్లలో అధికశాతం పాఠశాలల యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయన్నారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదించామన్నారు. పాఠశాలల యాజమాన్యాలు అసలు ఎందుకు నిరాకరిస్తున్నారో సంబంధిత పాఠశాలల వారితోను వారి అసోసియేషన్లుతో ప్రభుత్వం సమావేశాన్ని ఏర్పాటుచేసి వారి లోటుపాట్లు, ఇబ్బందులు తదితర అభిప్రాయాలను పరిశీలనలోకి తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ విధమైన ప్రణాళికాయుత ముందస్తు చర్యలతోనే రాష్ట్రంలో శాతశాతం ఆర్టీఈ చట్టం అమలుతోపాటు పేద పిల్లలను, వారి హక్కులను కాపాడాలని కోరినట్లు చెప్పారు. ప్రతీ ఏడాది ఆర్టీఈ అడ్మిషన్లు ప్రారంభంలో ఇవే సమస్యలు పునరావృతం అవుతున్న నేపథ్యంలో ఇటు విద్యార్థులు, అటు తల్లిదండ్రుల బాధలు, వేదనలు వర్ణనాతీతంగా ఉంటున్నాయన్నారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికాయుతంగా అడుగులు వేయాలని కోరారు.

## వీబీజీ రాజు సేవలు ప్రశంసనీయం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్‌గా పనిచేసి పదవీ విరమణ చేస్తున్న విబిజి రాజు సేవలు ప్రశంసనీయమని విశ్రాంత శ్రీకాకుళం జిల్లా వైద్యారోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మెండ ప్రవీణ్ అన్నారు. నరసన్నపేటలో ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రతిష్ఠను పెంపొందించే జాతీయ అంధత్వ, దృష్టి లోపాల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో వీబీజీ రాజు వంటి ఆప్తాల్మిక్ ఆఫీసర్స్ సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ జీవీ రమణ కుమార్ మాట్లాడుతూ అంధత్వ నివారణ కార్యక్రమంలో అంకితభావంతో విశిష్ట సేవలందించిన వీబీజీ రాజును కొనియాడారు. కార్యక్రమంలో జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జి.సుజాత మాట్లాడుతూ వీబీజీ రాజు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంలో ఎప్పుడూ ముందుండేవారన్నారు. క్రమశిక్షణతో పనిచేసి పదవీవిరమణ పొందడం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తాడేల శ్రీకాంత్, డా.పి.ప్రశాంతి, డాక్టర్ పేడాడ శిరీష, డా.మాతల ఆనందరావు, డీసీసీబీ మాజీ అధ్యక్షులు కరిమి రాజేశ్వరరావు, జిల్లాలలో ఉన్న ఆప్తాలమిక్ అధికారులు, ఉర్లం, మాకివలస, జలుమూరు, అచ్చుతాపురం, పోలాకి వైద్య ఆరోగ్య సిబ్బంది, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డైరీలు పంపిణీ

(సత్యంన్యూస్, ఎల్.ఎన్.పేట)

మండలంలో కోయిల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు హోంవర్క్ డైరీలనులను పాఠశాల వైస్ చైర్మన్ రేవతి వితరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల ఉండాలన్న ఉద్దేశ్యంతో ఈ డైరీలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మూల గజపతిరావు, గ్రామపెద్దలు కొమరపు చిరంజీవి, నడిపిల్లి నారాయణరావు వారిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పెద్దకోట వెంకటరావు పెద్దకోట శ్రీనివాసరావు వెంకటలక్ష్మి పాల్గొన్నారు



## ఉంగటి రాజుకు ఓదార్పు

(సత్యంన్యూస్, నరసన్నపేట)

మండలంలోని కోమర్తి గ్రామంలో గత 45 ఏళ్లుగా సర్పంచ్ ఉంగటి రాజు అనుభవంలో ఉన్న రేకుల షెడ్‌ను అన్యాయంగా, అక్రమంగా కూటమి ప్రభుత్వం నేల కూల్చింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ వారి కుటుంబసభ్యులను ఓదార్చి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చింతు రామారావు, రాష్ట్ర పొందర కూరకుల కార్పొరేషన్ విభాగ అధ్యక్షులు రాజపు అప్పన్న, నియోజకవర్గ పంచాయతీరాజ్ అధ్యక్షులు బగ్గు రమణయ్య, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు యాబాజీ రమేష్, మండల యూత్ అధ్యక్షులు బుద్దల రాజశేఖర్, సర్పంచ్ కనపల శేఖర్, ఎంపీటీసీలు పంచిరెడ్డి సత్యం, రువ్వ వాసుదేవరావు, మండల కార్యవర్గ సభ్యులు కోల ఈశ్వరరావు, మండల యూత్ ఉప అధ్యక్షులు తోట భార్గవ్, కనపల అరవింద్, తంగి అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.





శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి మండపం చుట్టూ స్టీల్ గ్రిల్స్‌ని ఏర్పాటు చేసేందుకు విశాఖపట్నంకు చెందిన బెల్లాన శ్రీనివాసరావు, భారతి దంపతులు రూ.10లక్షలు విరాళం అందజేశారు. ఈమేరకు సోమవారం ఆలయాన్ని సందర్శించిన వారు ఈ మొత్తాన్ని దేవాలయం ధర్మకర్త గోగుల వరప్రసాద నాయుడుకు అందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు శెట్టి బానోజీరావు, ప్రధానార్చకులు బాలకృష్ణ శర్మ, రంగనాయకులు, శంకర్రావు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, కొత్తూరు

## ప్రజా సాహిత్యం ఉపాధ్యాయులే నిర్మించగలరు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉపాధ్యాయులే ఉద్యమాలను సాహిత్యాలను నిర్మిస్తారని ఏపీటీఎఫ్ పుస్తక ఆవిష్కరణసభలో పేర్కొన్నారు. శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో ఆదివారం జరిగిన ఆవిష్కరణ, పరిచయ సభ ఏపీటీఎఫ్ అధ్యక్షులు మజ్జి మదన్మోహన్ అధ్యక్షతన నిర్వహింపబడింది. ఈ పుస్తక ఆవిష్కరణ ఏపిటిఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి సిహెచ్ ప్రభాకర్ రావు గారి జీవిత భాగస్వామి చిగురుపల్లి చంద్రకళ జ్ఞాపికగా, ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆవిష్కరించి విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్వి అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు విద్యార్థులకు సాహిత్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏపిటిఎఫ్ నిరంతరం అధ్యయనంలో ఉంటుందని పేర్కొంటూ, ప్రభాకర్‌రావు ఏపీటీఎఫ్ ఉద్యమ నిర్మాణంలో ఉండే సమయంలో పరోక్షంగా చంద్రకళ ఎంతగానో సహకరించారని గుర్తు చేశారు. ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి చిగురుపల్లి ప్రభాకర్ రావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ఉపాధ్యాయులే ఉద్యమ నిర్మాతలన్నారు. కంచరాన భుజంగరావు రచించిన గీసి చెరిపే బొమ్మ ఆవిష్కరణ ప్రముఖ రచయిత గంటాడ గౌరుయుడు ఆవిష్కరించారు. బీసీ చెరిపే బొమ్మ పుస్తక పరిచయం డాక్టర్ సుంకర గోపాలయ్య చేశారు. దివికుమార్ రచించిన ఉరికంబం సాక్షిగా పుస్తక పరిచయాన్ని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి పరిచయం చేసారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ తిరుమల చైతన్య, రచయిత అట్టాడ అప్పలనాయుడు, కవి కంచరాన భుజంగరావు, జన సహితి జిల్లా కార్యదర్శి పి.మోహన్‌రావు, చావలి శ్రీనివాస్, సదాశివుని శంకరరావు, సిహెచ్ రామచంద్రరావు, ఎపిటిఎఫ్ సీనియర్ నాయకులు కె.గోవిందరావు, పి లక్ష్మణ రావు, రౌతు గణపతిరావు నాయుడు, మజ్జి శ్రీనివాసరావు, సిహెచ్ అచ్యుత రావు, జీవి రమణ, కె వి రమణ, బి.వి రమణ, పాపి నాయుడు, కే రాజారావు, బి.త్రినాధరావు, టి.సూర్యనారాయణ, హెచ్‌వీ సత్యనారాయణ, డి.సరస్వతి, బల్ల సుభాష్ బాబు, పేడాడ అప్పలనాయుడు, గవ్వ భీమారావు, వి.నవీన్ కుమార్, దాసరి రామ్మోహనరావు, చావలి శ్రీనివాస్, పి.తిరుమలరావు, చిట్టి త్రినాధ రావు, పి మోహనరావు, పిఎస్ నాగరాజు, సదాశివుని శంకరరావు, చిగురుపల్లి శైలజ, చింతాడ తిరుమల రావు, దాసరి రామచంద్రరావు, జన సాహితీ జిల్లా కార్యదర్శి పి మోహన్ రావు, మార్పు మల్లేశ్వరరావు, జి.సూర్యనారాయణ, ప్రజాసాహితీ సంపాదకులు పిఎస్ నాగరాజు, బి భానుమూర్తి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, సాహిత్య అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు దృష్టికి పిఎన్ కాలనీ సమస్యలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని పిఎన్ కాలనీ 5వ లైన్‌లో స్థానికులు ఎదుర్కొంటున్నా సమస్యలకు పరిష్కారం చూపాలని నగర వైకాపా ప్రధాన కార్యదర్శి సీపాన మహేంద్ర అధికారులను కోరారు. సోమవారం జడ్పీలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కాలనిలోని సమస్యలను అధికారులకు విన్నవించారు. ఐదో లైన్‌లో అపోలో ఫార్మసీ ఎదురుగా నారాయణ తిరుమల దేవాలయంకు వెళ్లే మార్గం నుంచి భక్తులు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. డ్రైనేజీ లేకపోవడంతో మురుగు రోడ్డుపై చేరుతుందని వివరించారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి రాకపోకలకు సమస్యగా మారిందని తెలిపారు. తక్షణమే సమస్యల పరిస్కారం కోసం చొరవ చూపాలని కోరారు. అధికారులను కలిసినవారిలో పార్టీ మహిళా నాయకులు రెడ్డిపల్లి నీలవేణి, పైడి అనూష తదితరులున్నారు.



## ప్రజలంతా ఆదరించండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



సంవత్సర కాలంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రజలంతా ఆదరించి అండగా నిలవాలని నగర టీడీపీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ అన్నారు. ఈమేరకు కరపత్రాన్ని సోమవారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జూలై 2 నుండి కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఈ ఏడాది కాలంలో వారి పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తెలపడానికి ప్రతీ ఇంటికి వస్తున్న ప్రజాప్రతినిధులను, పార్టీ నాయకులను అన్ని వర్గాల ప్రజలు ఆదరించి అండగా నిలవాలన్నారు. కూటమి పార్టీలు (తెలుగుదేశం, జనసేన, బీజేపీ) ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు ఆశయాలు కనుగుణంగా ప్రజా రంజక, స్వర్ణయుగ పాలనతో సంవత్సర కాలం సుపరిపాలనతో తొలి అడుగు దిగ్విజయంగా వేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలు చాలావరకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకున్నా నెరవేర్చామని పరిశ్రమలు రాకతో లక్షలాది ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయన్నారు.

## సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి ఆర్థిక సహాయం

(సత్యంన్యూస్, టెక్కలి)

టెక్కలికి చెందిన ఆరు నెలలు వయస్సు వున్న లవిత్ర ప్రాణాంతక కాలేయ వ్యాధి అయిన పిత్తాశయ అట్రేసియాతో బాధపడుతోందని, పాప బ్రతకడానికి అత్యవసరంగా కాలేయ మార్పిడి అవసరం అని శస్త్రచికిత్స ఖర్చు రూ.25 లక్షల వరకు అవుతుంది డాక్టర్ చెప్పడంతో పాప తల్లితండ్రులు పాప ఆపరేషన్ కోసం సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి సంస్థను సంప్రదించారు. దీంతో వారు రూ.20వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సంస్థసభ్యులు పొడుగు అవినాష్, బరాటం చంద్రశేఖర్, పాప కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



## పేద విద్యార్థులకు లంచ్‌బాగ్స్ వితరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నడుపబడుతున్న శాంత కళ్యాణ్ అనురాగ నిలయంలో విద్యార్థులకు నగరానికి చెందిన జి.కృష్ణ లంచ్ బాగ్స్, పెన్నులు, పుస్తకాలను, శ్రీకాకుళం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్ రావు చేతులమీదుగా సోమవారం అందించారు. ఈ సందర్భంగా పి.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ జి.కృష్ణ మోటార్ మెకానిక్‌గా పనిచేస్తూ, సామాజిక బాధ్యతతో అనురాగానిలయంలో విద్యార్థులకు చదువుకు అవసరమైన సామాగ్రిని అందించటం హర్షణీయమని, దానాల్లో విద్యాధానానికి ప్రాముఖ్యత ఉందని, వారికి ఉపయోగకరం వస్తువులను బలగ చంద్రమౌళితో కలసి పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అనురాగ నిలయం విద్యార్థులు, వైకుంఠరావు, దుర్గప్రసాద్, డా.ఎన్.అప్పన్న, నిర్వాహక బృంద సభ్యులు లలిత, సాయి సుధాకర్, ఆశ, సేవకులు ఉర్లం శివతేజ, రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, దాతలు కృష్ణ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.






















## ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా

# పీవీఎన్ మాధవ్ పేరు ఖరారు

(సత్యంన్యూస్, విజయవాడ)



ఏపీ బీజేపీ అధ్యక్షుడి ఎంపిక కొలిక్కి వచ్చింది. అధ్యక్ష పదవికి మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ పేరును ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన గతంలో శాసనమండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. ఆర్ఎస్ఎస్, బీజేవైఎంలో బాధ్యతలు నిర్వర్తించారు. మాధవ్ బీజేపీ సీనియర్ నేత, దివంగత చలపతిరావు కుమారుడు. ఆయన తండ్రి రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేశారు. అధ్యక్ష పదవికి మధ్యాహ్నం 2 గంటల తర్వాత మాధవ్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం అధ్యక్ష ఎన్నిక నిర్వహించనున్నారు. కర్ణాటక ఎంపీ మోహన్ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించనున్నారు.

# అప్పల..'రాజ'రికం పనికిరాదు!

(మొదటిపేజీ తరువాయి)

హొదాలో పోటీ చేసినా అప్పలరాజు 42,600 ఓట్ల తేడాతో ఓడిపోయారంటే.. అసమ్మతి నేతల ప్రభావం ఎంత? ప్రజల అసంతృప్తి శాతం ఎంత? అనేది ఆయన కనీసం పట్టించుకోలేదని అర్థమవుతుంది.

**అణచివేత విధానాలతో అనర్థం**

కేవలం ఆ నలుగురి కోటరీలో బందీగా మిగిలిపోయి రెండో ఎన్నికకే సామ్రాట్‌నన్న భావనలోకి వెళ్లిపోయి అంతవరకు తనతో నడిచినవారిని వదిలేశారు. పలాస-కాశీబుగ్గ టౌన్‌లో టీడీపీ అభ్యర్థి గౌతు శిరీషకు 14,875 ఓట్ల మెజార్టీ వచ్చింది. వాస్తవానికి మంత్రిగా టౌన్‌లో ఉన్నది అప్పలరాజే. శిరీష స్థానికేతరురాలని ప్రచారం చేసినా ఫలితం ఇవ్వలేదు. పోనీ అప్పలరాజు సొంత మండలం వజ్రపుకొత్తూరులోనైనా ఆయనకు మెజార్టీ వచ్చిందా అంటే.. అక్కడ కూడా శిరీషకే 14,900 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఇక మిగిలిన రెండు మండలాల్లో కూడా ఆమె మెజార్టీని అప్పలరాజు తగ్గించలేకపోయారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి సునామీ వచ్చినందున ఓడిపోయినవారందరి పరిస్థితి ఇదేనని అప్పలరాజును ఆ నలుగురూ ఓదార్చి ఉంటారు. కానీ రాష్ట్రంలో వైకాపాకు 12వ సీటుగా గెలవాల్సిన నియోజకవర్గం పలాస. ఎందుకంటే.. పోల్ మేనేజ్‌మెంట్‌కు అవసరమైన మందీమార్బలం, పార్టీ సహకారం, ఆర్థిక పరిపుష్టి అన్నీ ఇక్కడ ఉన్నాయి. జిల్లాలో వైకాపా ఓడిపోయిన మిగిలిన నియోజక వర్గాల మాదిరిగా అంతఃకలహాలు ఇక్కడ లేవు. కేవలం మంత్రి అప్పలరాజుపై ఉన్న అసంతృప్తిని, అసమ్మతివాదులను ఆయన బుజ్జగించుకోగలిగితే కచ్చితంగా గెలిచేవారు. కానీ దానికి విరుద్ధంగా తనకు వ్యతిరేకంగా గళం విప్పిన ప్రతి ఒక్కరిపైనా అణచివేతకు పూనుకోవడం వల్ల డ్యామేజ్ కంట్రోల్ చేయలేకపోయారు. ఆర్థికంగా బలపడితే తన సీటుకు ఎసరొస్తుందన్న భావనతో మెజార్టీ సామాజిక వర్గానికి చెందిన పార్టీ నేతలను అప్పలరాజు తొక్కేశారు. రాజకీయాల్లో ఇది సహజం. అయితే దానికీ ఒక హద్దు ఉంటుంది. మొదటి సారి ఎన్నికైనా మంత్రి పదవి వరించినప్పుడే తాను స్థానిక నేతల స్థాయిని దాటేశానన్న విషయాన్ని అప్పలరాజు మర్చిపోయారు. అభద్రతతో కక్ష సాధింపులకు దిగడం వల్ల ఐదేళ్లలో అది చిరిగి చాటంత అయ్యింది. దాని ఫలితమే 2024 ఎన్నికల్లో భారీ ఓటమి.

**తొక్కేసినవారే శిరమెత్తుతున్నారు**

అప్పలరాజుపై ఎప్పటికప్పుడు ఫిర్యాదులు చేసినా, అసంతృప్తి రాగాలు వినిపించినా వైకాపా అధిష్టానం పట్టించుకోలేదంటే.. అధిష్టానం వద్ద తన స్థాయి ఏంటో అర్థమవ్వాలి. కానీ ఆయన జగన్మోహన్‌రెడ్డి అండ్ కో వద్ద తనకున్న పట్టు మర్చిపోయి , స్థాయి మర్చిపోయి స్థానికంగా పట్టింపులకు పోయి అందర్నీ దూరం చేసుకున్నారు. దువ్వాడ శ్రీధర్ (బాబా) లాంటివారు చాలా రోజుల నుంచి అప్పలరాజును వ్యతిరేకిస్తున్నారు. కానీ సిటింగ్ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు కూడా వచ్చే ఎన్నికలకు అప్పలరాజు పనికిరారని కృష్ణదాస్, సీతారామ్‌లకు చెప్పడం గమనార్హం. పలాసలో మేజర్ సామాజికవర్గానికి చెందిన గిరిబాబును తానే చైర్మన్‌ను చేశానని చెప్పుకునే డాక్టర్ అప్పలరాజు.. అక్కడ కూడా సమాంతర నాయకత్వం తయారవుతుందని భావించి గిరిబాబును తొక్కేయడం ప్రారంభించారు. దీంతో పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, లేనప్పుడు కూడా ఆయన అనేక అవమానాలు పడ్డారని పలాసలో ఓ టాక్ నడుస్తోంది. దాని ఫలితంగానే రాబోయే ఎన్నికల కోసం ఇప్పట్నుంచే అప్పలరాజును వ్యతిరేకించే కార్యక్రమం మొదలైంది. అప్పలరాజు కొలువులో ప్రస్తుతం ఉన్న గుప్పెడుమంది భట్రాజుల్లా పనికొస్తారేమో గానీ గెలిపించే స్థాయి ఉన్నవారు మాత్రం కాదు. గత ఎన్నికల సమయంలో అప్పలరాజు ఓడిపోతారని పార్టీకి తెలియజేసినా సమయాభావం వల్ల నాయకత్వం సరిదిద్దుకోలేకపోయిందన్న భావనతో నాలుగేళ్ల ముందే ఆయన అభ్యర్థిత్వాన్ని తాము బలపర్చలేమన్న సంకేతాలు పార్టీకి పంపుతున్నామని, దానివల్ల ముందుగానే పార్టీ దృష్టి సారిస్తుందన్న నమ్మకంతో ఇన్‌ఛార్జి, అధ్యక్షులను కలిశామని అసమ్మతి నేతలు చెబుతున్నారు. మీడియాలో గాని, సోషల్ మీడియాలో గానీ తనపై వ్యతిరేకంగా కథనాలు వస్తే కౌంటర్ రాయించుకోవడం, తాను పెంచి పోషిస్తున్నవారితో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించుకోవడం కాకుండా.. గాయం ఉన్నచోట మందు పూయాల్సిన అవసరాన్ని అప్పలరాజు గుర్తించాలి. జిల్లాలో పలువురు సీనియర్ నేతలకు వయసైపోయుండొచ్చు.. అదే సమయంలో యువనేతగా అప్పలరాజుకు చాలా భవిష్యత్తు కూడా ఉండొచ్చు. కానీ సీనియర్ల స్థానంలో ఆయన రాజకీయంగా ఏలాలంటే.. ముందు ఆయనకో రాజ్యం ఉండాలి. అందులో సైన్యం ఉండాలి. అన్నింటికీ మించి యుద్ధంలో గెలవాలి. దాన్ని వదిలేసి భవిష్యత్తులో జిల్లాలో తానే చక్రం తిప్పుతానన్న భావన ఉంటే.. ముందు నియోజకవర్గం చేజారిపోతుంది. ఇంత చిన్న లాజిక్కు ఎన్నో రోగాలను నయం చేసిన డాక్టర్‌కు తెలియంది కాదు. కాకపోతే ఆయన ఆ నలుగురి మెదడుతో ఆలోచిస్తున్నట్టున్నారు.















Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.